క్లుప్తంగా

శ్రీవారి పథకాలకు విరాళం



శ్రీనివాస్‌కు విరాళం బాండ్ అందిస్తున్న నటరాజారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకాలకు ఇద్దరు భక్తులు బుధవారం వేర్వేరుగా రూ.5,43,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన శ్రీనివాస్ నిత్యాన్నదాన పథకానికి రూ.2,21,000, గోసంరక్షణ పథకానికి రూ.2,21,000లు, హైదరాబాద్‌కు చెందిన కర్రి అప్పిరెడ్డి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

వెంకటేశ్వరరావు సేవలు మార్గదర్శకం



వెంకటేశ్వర రావును సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన అడ్డాల వెంకటేశ్వరరావు సేవలు నేటి ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఏలూరు రేంజ్ డీఐజీ ఎస్. మాధవి అన్నారు. ఏలూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ డిసెంబర్ 31న పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరరావు అభినందన సభ స్థానిక గ్రాండ్ కృష్ణ ఫంక్షన్ హాలులో బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాధవి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ శాఖ లక్ష్యాల సాధనకు వెంకటేశ్వరరావు విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, భీమవరం జిల్లాల రిజిస్ట్రారు కె.శ్రీనివాసరావు, లంకా వెంకటేశ్వర్లు, ఏలూరు జిల్లా మార్కెట్ వాల్యూ అడిట్ రిజిస్ట్రార్ ఎం. పార్వతి, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గా ప్రసాద్, రిటైర్డ్ డీఐజీ కె. అబ్రహం, రిటైర్డ్ జిల్లా రిజిస్ట్రార్ ఎండీ సిరాజుల్లా సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: కోరుకొల్లులో కోడి పందాల శిబిరంపై బుధవారం భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.2200 నగదుతో పాటు ఒక కోడి, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. భీమడోలులోని ఆరుంధతీ కాలనీలో సాయంత్రం పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.9700లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. పూళ్లలో రైల్వే ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగింది.

సొంతింటి కల నెరవేరేనా?

- టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూపు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- లబ్ధిదారుల ఆవేదన



నిలిచిన టిడ్కో ఇళ్ల నిర్మాణం

ఏలూరు (టూటౌన్): సొంతింటి కల నేరవేరుతుందా లేదా అనే మీమాంసలో ఉన్నారు పట్టణ ప్రాంత పేదలు. టిడ్కో ఇళ్ల కోసం వారు నిరీక్షిస్తున్నారు. ఎన్నికల్లో టిడ్కో ఇళ్లను పంపిణీ చేసేస్తామంటూ ఉత్తర ప్రగల్భాలు పలిగిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఆరు నెలలు దాటినా పట్టించుకోవడం లేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. చేసే పనులకు చెప్పే మాటలకు పొంతన లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

2,208 మంది లబ్ధిదారులు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం ఎంపికైన 2,208 లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. టిడ్కో ఇళ్ల కోసం 2018లో మొత్తం 6,480 మంది దరఖాస్తు చేసుకోగా, 2,208 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ ప్రక్రియలో భాగంగా నాడు పలువురు కార్పొరేటర్లు తమకు తాయిలాలు ఇచ్చిన వారికే ఇళ్ల కేటాయింపు చేసేలా చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారుల నుంచి రూ.50 వేలు చొప్పున తమ వాటా సొమ్ముగా తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇళ్లు నేటికీ తమ చేతికి అందలేదని, బ్యాంకు వడ్డీ లెక్క కట్టినా తాము చెల్లించిన మొత్తం సొమ్ము రెట్టింపయ్యేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏడేళ్ల క్రితం రూ.50 వేలు కట్టాం

టిడ్కో ఇంటి కోసం రూ.50 వేలు కట్టి ఏడు సంవత్సరాలు గడిచింది. ఇంతవరకు మాకు ఇల్లు అప్పగించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోతున్నా పేదల సంక్షేమం గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. ప్రచార ఆర్భాటం తప్ప.. పేదల గురించి పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. మేము కట్టిన డబ్బు బ్యాంకులో వేసుకుంటే వడ్డీ అయినా వచ్చేది. ప్రభుత్వం స్పందించి ఇల్లు అప్పగించాలి.

– గొర్లి స్వాతి, లబ్ధిదారురాలు, కుమ్మర రేవు, 29వ డివిజన్ ఏలూరు

తక్షణం ఇళ్లు అప్పగించాలి



లబ్ధిదారులకు పూర్తయిన ఫ్లాట్లను తక్షణం అప్పగించాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లు అప్పగిస్తామంటూ చెప్పిన టీడీపీ ఇప్పుడు నోరు మెదపకపోవడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతి నాటికల్లా టిడ్కో ఇళ్లను లబ్ధిదారుకు అందించే ఏర్పాట్లు చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి, ఏలూరు

నిర్లక్ష్యం తగదు



కూటమి ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలంటూ రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన కూటమి నాయకులు తాజాగా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకోవడంలేదు. ఇది వారి ద్వంద్వ వైఖరికి అద్దంపడుతుంది.

– డీఎన్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ కార్యదర్శి, ఏలూరు జిల్లా

100 బ్లాకుల నిర్మాణానికి ఏర్పాటు

పోణంగి రోడ్డులో మొత్తం 60 ఎకరాలను భూ సేకరణ చేశారు. ఆ ప్రాంతంలో ఒక్కో బ్లాకుకు 48 ఫ్లాట్లు చొప్పున మొత్తం 100 బ్లాకుల్లో 4,800 ఫ్లాట్లు నిర్మించాలనేది లక్ష్యం. తొలి విడత 40 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 20 ఫ్లాట్లు మాత్రమే నివాసయోగ్యంగా నిర్మించారు. మరో 20 ఫ్లాట్లు 80 శాతం మేర పూర్తి చేశారు. విగిలిన నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

స్వచ్ఛ భారత్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ భారత్ వాకర్స్ మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో పదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధ్యాహ్నపు వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు పంపుల చెరువు వద్ద బుధవారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కల్లూరి చంద్రశేఖర్, చేకూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్ భాస్కరరావు, గౌరవ అధ్యక్షులుగా మధ్యాహ్నపు వెంకటేశ్వరరావు, కట్టా ఈశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వైఎస్ కనకారావు, ఉపాధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, చిదరబోయిన శ్రీనివాసరావు, పసుపులేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా కాపా పాండురంగారావు, కొండేటి పోతురాజు, తలారి రాము, కమిటీ సభ్యులుగా ఎస్ భాస్కర్‌రావు, గల్లా శ్రీనివాసరావు, సముద్రాల కృష్ణమోహన్, గుబ్బల సత్యనారాయణ, మద్దిరాల రామలింగేశ్వరరావు, మధ్యాహ్నపు పద్మనాభం ఎన్నికయ్యారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సాయంకాల పూజలు నిర్వహించారు. 5 గంటలకు నగరానికి చెందిన సప్పా భారతి భాగవతారిణి భీష్మ ప్రతిజ్ఞ అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 7 గంటల నుంచి కె.స్వర్ణలత శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, వేద పండితులు యనమండ్ర వేంకట రవిప్రకాష్ శర్మావధాని విశేష పూజలు చేయగా, బ్రహ్మోత్సవ యాజ్ఞీకులు జీవీవీ దీక్షితులు, కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు యాగాదులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వరి కుప్ప దగ్ధం



చింతలపూడి: మండలంలోని ప్రగడవరం రామరాజు కుంట చెరువు వద్ద ఒక రైతుకు చెందిన వరి కుప్ప బుధవారం అగ్నికి ఆహుతయ్యింది. అంకంపాలెం గ్రామానికి చెందిన నందిపాము మారేషుకు చెందిన ఎకరం 30 సెంట్ల పొలంలో పండించిన వరి పంటను కుప్ప వేశాడు. బధవారం వరికుప్పకు నిప్పు అంటుకుంది. గ్రామస్తుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే 90 శాతం వరి ధాన్యం కాలి బూడిదగా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వరి పంట పూర్తిగా దగ్ధం అయ్యిందని రైతు మారేసు తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకొంటున్నాడు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు





సమన్వయకర్త జయప్రకాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు, ఎంపీపీ శ్రీనివాసరాజును సన్మానించిన అధికారులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌ను ఏలూరు నగరంలోని పలువురు ప్రముఖులు, నాయకులు, ఆయా సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు కిలాడి దుర్గారావు, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షులు పల్లి శ్రీనివాస్, మైనార్టీ సెల్ నాయకులు రియాజ్ అలీఖాన్ తదితరులు గజమాలతో జేపీని సత్కరించారు. ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు జయప్రకాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమలోద్భవి కథీడ్రల్‌లో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక బిషప్ హౌస్‌లోని అమలోద్భవి కథీడ్రల్‌లో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. కథీడ్రల్ చర్చ్ రెక్టర్ ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో ఆయన ప్రధానాచార్యులుగా దివ్య బలిపూజ అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖ శాంతులతో సుభిక్షంగా జీవించాలని, దేశ నాయకులను, పాలకులను దేవుడు భద్రంగా కాపాడాలని, దాని కోసం విశ్వాసులు ప్రార్థనలు చేయాలని సూచించారు. ఏలూరు పీఠం ప్రొక్యూరేటర్ ఫాదర్ బి.రాజు మాట్లాడుతూ ప్రజలు నూతన సంవత్సరంలో నూతన హృదయాలతో మారుమనస్సు పొంది జీవించాలని, నీతి, న్యాయం, ధర్మం ప్రకారం జీవించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పేదసాదలకు సహాయపడాలని సూచించారు. ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు తరపున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్లు ఎస్ విద్యా సాగర్, జోసఫ్, ఎస్ స్టీఫెన్, కార్పొరేటర్ ఎం నిర్మల, ఎస్ థామస్, డి.అబ్రహం, జె.బెనర్జీ, ఐ.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఫాదర్ ఇంజమాల మైఖేల్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏలూరు రూరల్ : అభివృద్ధిలో ఏలూరు రూరల్ మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయన్ని కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎంపీపీకి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలత, సూపరింటెండెంట్ సుజాత, ఏపీఓ కిషోర్, కార్యదర్శులు సుమలత, కుమార్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

సంతోషంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని మేయర్ షేక్ నూర్జహాన్ ఆకాంక్షించారు. మేయర్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మేయర్ క్యాంపు కార్యాలయంలో సందడి నెలకొంది.

మహిళల పాత్ర కీలకం

ఏలూరు (టూటౌన్): కుటుంబ పోషణలో మహిళలు ప్రధాన పాత్ర వహిస్తారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ షాపింగ్ మాల్, జీవీ మాల్‌లో ఏలూరు జిల్లా అధ్యక్షులు వరక శ్యామల అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. కృష్ణవేణి, మాధవి, అనిత, భారతి, శివ పార్వతి, మౌనిక, జ్యోతి, అనూష 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీర్నచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	40
బెండకాయలు	38	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32	కంద	60
కాకర కాయలు	36-44	బీట్‌రూట్	52
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	92
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	56	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07
దోసకాయలు	24-30	పుదీనా	05
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

ఉన్ని దుస్తులకు భలే గిరాకీ

- చలిని తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలపై ప్రజల దృష్టి
- ఇటీవల పెరిగిన చలి తీవ్రత



భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణం

భీమడోలు: చలికాలం వచ్చిందంటే చాలు గజగజ వణికించే చలిని తట్టుకునేందుకు అన్ని దుస్తులు ధరించాల్సిందే. చలి ఉధృతి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ ఉన్ని దుస్తులను వేసుకోవాలి. సాయంత్రం 5 నుంచి మరసటి రోజు ఉదయం 9 గంటల వరకు చలి ప్రభావం తగ్గడం లేదు. కొన్ని రోజుల క్రితం వర్షాలు కురవడంతో చలి ప్రభావం పెద్దగా లేదు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. దీనితో చలితో ప్రజలు వణికిపోతున్నారు. చలి, మంచు నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. దీనితో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరుగుతుంది. దీనితో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎక్కువగా మంకీ టోపీలు, మఫ్లర్లు, ఉన్ని స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది. భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల విక్రయాలు మరింత జోరందుకున్నారు. మధ్య తరగతి నుంచి సాధారణ ప్రజలకు ఈ దుకాణం వద్ద అన్ని రకాల ఉన్ని వస్త్రాలు లభ్యమవుతుండడంతో జనం ఎగబడుతున్నారు. గతం కన్నా ఈ ఏడాది వ్యాపారాలు ఆశాజనకంగా లేవని వ్యాపారులు అంటున్నారు. ప్రజల వద్ద కూడా డబ్బులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. పెద్దలు, మహిళలు, పిల్లల కోసం ఉలెన్ జర్కిన్లు, మంకీ టోపీలు, రగ్గులు, శాలువాలు, మఫ్లర్లు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఒకొక్కటి రూ.300 నుంచి రూ.3 వేల వరకు ఉన్ని వస్త్రాలు వాటి నాణ్యత ఆధారంగా లభ్యమవుతున్నాయి. రెయిన్ కోట్లు, మంకీ టోపీలు, స్వెట్టర్లు, దుప్పట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.600, మంకీ టోపీలు రూ.100 నుంచి రూ.150, దుప్పట్లు రూ.350 నుంచి రూ.1,300 వరకు పలుకుతోందని కొనుగోలు దారులు అంటున్నారు. కొన్ని నెలలుగా మధ్యప్రదేశ్‌కు చెందిన యువకులు ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.



ఆకర్షణీయంగా స్వెట్టరు

గ్రామాల్లో హైటెక్ హరిదాసు



గణపవరం: సంక్రాంతి రోజుల్లో సందడి చేసే హరిదాసులు మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా సాంకేతిక విప్లవం ముందు సంప్రదాయం వెలవెలబోతుంది. ప్రస్తుత సంక్రాంతి సీజన్‌లో ఏ గ్రామంలో చూసినా హైటెక్ హరిదాసులే కనిపిస్తున్నారు. మోటార్ సైకిల్‌కు మైక్ సెట్‌ను అమర్చి, రికార్డు చేసిన సంకీర్తనలు వినిపిస్తూ రయ్‌రయ్ మంటూ వీధులను చుట్టేస్తున్నారు. ఒక కూడలి వద్ద ఆగి కొంతసేపు పాటలు వినిపిస్తూంటే చుట్టుపక్కల మహిళలు బియ్యం, డబ్బులు, కూరగాయలు వంటివి తెచ్చి అక్షయ పాత్రలో వేసి వెళుతున్నారు. హరిదాసులకు నేడు ఆదరణ కరువైందని గణపవరం చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతున్న కృష్ణాజిల్లాకు చెందిన శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి తర్వాత తోపుడు బండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకుంటానని ఆయన తెలిపారు.

తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు

దెందులూరు : అతి తక్కువ వడ్డీ రేట్లతో అందించే వివిధ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ టి.నాగార్జున కోరారు. బుధవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో బ్యాంక్ అకౌంటెంట్ ఉప్పలపాటి రామకృష్ణతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ఖాతాదారులకు సీనియర్ సిటిజన్‌కు 8.6 అత్యధిక వడ్డీని ఫిక్స్ డిపాజిట్లపై అందిస్తున్నామని, ఏడాది కాలపరిమితికి రూ.500లకే ప్రమాద బీమా 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏడాది కాల పరిమితిలో రూ.వెయ్యి చెల్లించి పాలసీ తీసుకుంటే మృతుల కుటుంబానికి రూ.20 లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు.